క్లుప్తంగా

ఈ క్రాప్ నమోదు చేసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వరి, వేరుశనగ, మినుము, మామిడి, చెరుకు, నిమ్మ పంటలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి భారతి తెలిపారు. రైతులు ఆధార్, పొలం, బ్యాంకు పాసు పుస్తకాల జిరాక్స్, ఫోన్ నంబర్లను అగ్రికల్చర్ అసిస్టెంట్లకు అందజేసి, ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఏర్పేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సూపర్‌వైజర్ భారతి అన్నారు. బుధవారం మండలంలోని అంజిమేడు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీలో పౌష్టికాహార వారోత్సవాలు జరిగా యి. అంగన్‌వాడీ కార్యకర్త స్వర్ణలత పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి

ఏర్పేడు: మండలంలోనిమునగలపాళెం వద్ద స్వర్ణముఖి నదిలో పిచ్చి మొక్కలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి పక్కన ఉన్న నదిలో దట్టంగా పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగాయని, అవి వర్షాకాలంలో నదిలో నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయని పేర్కొన్నారు. గత ఏడాదిలో స్వర్ణముఖి నుంచి నీటి ప్రవాహం గ్రామంలోకి చేరడంతో ఇబ్బందులు పడ్డామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, పిచ్చిమొక్కలు తొలగించాలని గ్రామ స్తులు కోరుతున్నారు.

ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

శ్రీకాళహస్తి: విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈ బాలాజీ తెలిపారు. తొట్టంబేడు మండలంలోని బోనుపల్లె సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సరఫరాపై ఏఈ బాలాజీ బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్లు విద్యుత్ అంతరాయానికి గల కారణాల గురించి తెలుసుకోవాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

లోవోల్టేజ్ సమస్య పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణిమిట్టలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటికి విన్నవించారు. బుధవారం సబ్‌స్టేషన్ వద్ద కమిటీ సమావేశం జరిగింది. పగటి పూట నిరంతరాయంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఇవ్వాలని, త్వరితగతిన జగనన్న లే అవుట్‌లోని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని వినియోగదారులు కోరారు. విద్యుత్ సేవలు, విద్యుత్ వాడకం గురించి, విద్యుత్ ప్రమాదాల నివారణపై ఏఈ పుణ్యకోటి అవగాహన కల్పించి, సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గురు స్మరణీయులు

పాఠశాల అంటే వారికి ఇంటితో సమానం. విద్యార్థులంటే కన్నబిడ్డలతో సమం.. బడిలో అడుగుపెట్టింది మొదలు ఏదో ఒక వినూత్న ప్రక్రియను ఎంచుకుని ముందుకు సాగుతారు. వచ్చినప్పటి నుంచి స్కూలు వదిలే వరకు విద్యార్థులతో మమేకమై, బోధన కొనసాగిస్తారు. కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తమ వంతు కృషి చేస్తున్నారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించి, విద్యాభివృద్ధికి శ్రమిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్న 'గురు'స్మరణీయులపై సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కథనం

- బోధనలో ప్రత్యేకం.. పాఠశాలతో మమేకం
- విద్యార్థులకు మార్గనిర్దేశకులవుతున్న ఉపాధ్యాయులు
- విద్యావారధులు..భవితకు సారథులు
- నేటి బాలలను రేపటి పౌరులుగా మలుస్తున్న కృషీవలురు

తెలుగుపై మమకారంతో..



వరదయ్యపాళెం: బీఎన్‌కండ్రిగ మండలం కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువశ్రీ మురళి తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయనకు మొదటి నుంచి తెలుగు భాష అంటే మమకారం. విద్యార్థులతో తెలుగులో కవిత్వాలు రాయించడం, వారికి గేయాల రూపంలో పాఠాలు బోధించడం ఆయన ప్రత్యేకత. తెలుగుభాష కోసం విశేష కృషి చేసినందుకు 2015లోనే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

ఆంగ్ల బోధనతో మన్ననలు



వరదయ్యపాళెం: బీఎన్ కండ్రిగ మండలం కల్లివెట్టు జెడ్పీ హైస్కూలులో జగన్నాథం ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తన దైన శైలిలో ఆంగ్లం బోధిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆయన డప్పు కళాకారుడిగా సమాజంలో మంచి పెంచేలా గేయాలు, పాటలను ఆలపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే లా ఇలాంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈయన సేవలను ప్రభుత్వం గుర్తించి 2019లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసి సత్కరించింది.

క్రీడా శిక్షణలో మేటి



వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూలులో బందిల కుమార్ ఫిజికల్ డైరెక్టర్(పీడీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈయన క్రీడల్లో శిక్షణ ఇస్తే విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాల్సిందే. ఆ దిశగా హైస్కూల్‌లో గత ఏడాది తొమ్మిదో తరగతి చదువుతున్న ఓలిపి మోహన్‌కృష్ణ కేరళలో జరిగే జాతీయ టెన్నిస్ వాలీబాల్‌కు ఎంపికయ్యేలా శిక్షణ ఇచ్చారు. ఈయన కృషిని గుర్తించిన ప్రభుత్వం 2019లో ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికై, జిల్లా స్థాయి అధికారుల నుంచి అవార్డు అందుకున్నారు.

ప్రయోగాల దిట్ట



వరదయ్యపాళెం: స్థానిక జెడ్పీ హైస్కూలులో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా మేఘనాథ్ విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే పాఠశాలలోని అటల్ ల్యాబ్‌కు ఆయన ఇన్‌చార్జిగా ఉన్నారు. దీంతో విద్యార్థులకు సృజనాత్మకతతో విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థులతో నూతన ప్రయోగాలు చేయించి, ప్రశంసలు అందుకున్నారు. ప్రాజెక్టు స్మార్ట్ బ్లైండ్ మ్యాన్ స్టిక్‌ను తయారు చేశారు. ఈ ప్రాజెక్టును జాతీయ స్థాయికి ఎంపికైంది. ఇంతటి ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయుడు మేఘనాథ్‌కు 2022లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది.

కొత్త పుంతలతో గణిత బోధన



వరదయ్యపాళెం: గణితంలో ఆయన బోధన వేరు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేరీతిలో గణిత పాఠ్యాంశాలు బోధించడమే రవి ప్రత్యేకత. ఈయన వరదయ్యపాళెం హైస్కూల్‌లో గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణంగా గణితం అంటే విద్యార్థులకు కాస్త ఇబ్బందికరం. అయితే ఈ మాస్టారు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేసి, పలువురు విద్యార్థులను గణితంలో ఉత్తమ మార్కులు సాధించే దిశగా కృషి చేశారు. ఎంత కష్టమైన లెక్క అయినా సులువుగా చేసేస్తారు. ఆయనకు గత ఏడాది ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

విద్యార్థుల పాలిట 'వరలక్ష్మి'



శ్రీకాళహస్తి: పట్టణంలోని బాబుఅగ్రహారం మున్సిపల్ హైస్కూలులో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వరలక్ష్మి విద్యార్థులకు విశిష్ట సేవలందించారు. 2016లో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అప్పటి కలెక్టర్ సిద్దార్థజైన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఎమ్మెస్సీ వైరాలజీ విద్యను అభ్యసించిన ఆమె మొదట పశుసంవర్ధకశాఖలో పనిచేశారు. అనంతరం విద్యార్థులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయురాలిగా బాబుఅగ్రహారం పాఠశాలలో సేవలందిస్తున్నారు. పాఠశాలను ఉన్నత స్థానంలో నిలపడంలో, విద్యార్థులకు సహకారం అందించడంలో ఆమె చేసిన సేవలు మరువలేనివి.

'బోధనలో రాజా'రాణి



శ్రీకాళహస్తి: మన్నవరం పంచాయతీ సింహాచలం కండ్రిగ పాఠశాలలో పనిచేస్తున్న రాజారాణి 2016 మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నికయ్యారు. జగ్గరాజుపల్లి పాఠశాలలో పనిచేసే సమయంలో పలువురు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష రాయించి, ప్రవేశం పొందేందుకు కృషి చేశారు. దీంతో ఆమెకు మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు లభించింది.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా శ్రీకాళహస్తి మండలానికి చెందిన నలుగురికి అవకాశం లభించింది. తొండమనాడు ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, వేడాం ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ చలం, ముచ్చివోలు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నరసింహులు, శ్రీకాళహస్తి పురపాలక సంఘం సరస్వతీబాయ్ పాఠశాల ఇంగ్లిషు ఉపాధ్యాయుడు కొత్తపల్లి వెంకటాద్రి, తొట్టంబేడు మండలం గుండేలిగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కందాటి మునీశ్వర్‌రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గురువారం తిరుపతి జిల్లా కేంద్రంలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా అందుకోనున్నారు.

సింహవాహనంపై అవనాక్షమ్మ


సింహవాహనంపై అవనాక్షమ్మ

నారాయణవనం: సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారు సింహవాహనంపై మహిసాసురమర్దినిగా సముదాయం వీధుల్లో విహరించారు. గత నెల 20వ తేదీ మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవాల్లో చివరి మూడు రోజుల పాటు అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయాధికారి నాగరాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి, పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారికి విశేషాలంకరణ చేసి సింహవాహనంపై కొలువుదీర్చి సముదాయం వీధుల్లో ఊరేగించారు. ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆర్జితం అధికారి భరత్‌లు ఉత్సవాలను పర్యవేక్షించారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ ప్రభురెడ్డి

నాగలాపురం: పరిసరాల శుభ్రతపై గ్రామాల్లో ప్రజల కు అవగాహన కల్పించాలని తిరుపతి డీఎల్‌పీఓ ప్రభురెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ పీఎంకే బాబు అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి డీఎల్‌పీఓ ప్రభురెడ్డి పాల్గొన్నారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువ ను శుభ్రం చేయడంతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు.ఎంపీడీఓ మాట్లాడు తూ గ్రామాల్లో డ్రైనేజీ పనులు తొందరగా ప్రారంభించాలన్నారు. నాగలాపురం టీపీ కోట రోడ్డు అధ్వానంగా ఉందని ఎస్ఎస్‌పురం సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొట్టకాడు, వేంబాక్కం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కొట్టకాడు సర్పంచ్ సత్యవేడు డిపో మేనేజర్‌ని కోరారు. సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ, వైస్ ఎంపీపీ కుమారి, ఎంపీటీసీ సభ్యుడు శేఖర్ పాల్గొన్నారు.

వేడుకగా ఉరుసు ఉత్సవం

రేణిగుంట: మండలంలోని మామండూరు అటవీ ప్రాంతంలో ఉన్న హజరత్ సర్వరుద్దీన్ షాహిద్ ఔలియా రహంతుల్లా అలై దర్గాలో బుధవారం ఉరుసు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలు, ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్గాలోని హజరత్ సర్వరుద్దీన్ సమాధి వద్ద ప్రార్థనలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం వసతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా ధర్మకర్తలు అక్బర్‌బాషా, జహంగీర్‌బాషా , కమిటీ సభ్యులు పాల్గొని భక్తులకు సేవలందించారు.

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పెద్దకన్నలి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఘనంగా పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. దీంతో రక్తహీనత తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రజిత, రాజేశ్వరి, మునిలక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

అమరరాజకు బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇనిషియేటివ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న రాజన్న ఫౌండేషన్ ప్రతినిధులు

రేణిగుంట: అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇనిషియేటివ్ అవార్డు లభించింది. బెంగళూరులో బుధవారం జీసీపీబీటీ సంస్థ నేషనల్ హెచ్‌ఆర్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ అవార్డును అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డీన్ కె.రవికుమార్, రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్లపల్లి కలసి రిపబ్లిక్ ఆఫ్ కొరియా జియోంగ్గీ బిజినెస్ సెంటర్ డైరెక్టర్ జుంటే జంగ్ చేతుల మీదుగా అందుకున్నారు. అత్యుత్తమ నైపుణ్యాలు, జ్ఞానంతో వ్యక్తులకు సాధికారత కల్పించడంలో, మెరుగైన జీవనోపాధి అవకాశాలను అందిస్తున్నందుకు గానూ ఈ అవార్డు అందుకున్నట్లు రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు తెలిపారు. గ్రామీణ యువతను ప్రోత్సహిస్తూ, ఉద్యోగ అవకాశాలు కల్పించి, సమగ్ర, స్థిర భవిష్యత్తును సృష్టించడమే లక్ష్యంగా స్థాపించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు అవార్డు రావడం ఆనందదాయకమన్నారు.

కమిషనర్ సేవలు ఆదర్శనీయం


రమేష్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ పొన్నూరుకు బదిలీ అయిన రమేష్‌బాబు సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. శ్రీకాళహస్తికి చెందిన పలువురు బుధవారం ఆయన్ని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమేష్‌బాబు పేదలకు సేవ చేయడంలో ముందుంటారని తెలిపారు. మున్సిపాలిటీలో ఏ సమస్య వచ్చినా సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించేవారన్నారు. ఈ కార్యక్రమంలో కలవగుంట భరత్‌రెడ్డి, జ్యోతిరావ్, చంద్రమౌళి, పఠాన్ ఫరీద్, చంద్రబాబు, రమణారెడ్డి, రమేష్, వంశీ, తింబ, మగదీప్, వినోద్, ఇమ్రాన్, చిట్టిబాబు, బాలాజీ, వెంకట్రావు, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ సునీల్ కుమార్

నాగలాపురం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ సునీల్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో విద్యార్థులకు అసాంఘిక కార్యకలాపాలతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలను వాడడం, విక్రయించడం, వాటికి బానిస కావడం నేరమన్నారు. అలాగే విద్యార్థులు సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి, చదువు మీద ధ్యాస పెట్టాలన్నారు. చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు బానిస కాకుండా విద్యార్థి దశలో చాలా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులకు సమస్య లుంటే కళాశాల ప్రిన్సిపల్‌కు లేక డయల్ 100కు తెలియజేయాలన్నారు.

తల్లిపాలలో ఔషధ గుణాలు


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శిల్ప

బుచ్చినాయుడుకండ్రిగ: పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమని, తల్లులు తప్పనిసరిగా బిడ్డలకు పాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప తెలిపారు. బుధవారం మండలంలోని ఆలత్తూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్, ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా తల్లి పాలు, పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టైఫాయిడ్, కామెర్లు, తదితర వ్యాధులను నిర్మూలించే ఔషధ గుణాలు తల్లి పాలలో ఉన్నాయని, బిడ్డ బరువు పెరిగేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిపాలు దోహదపడతాయని తెలిపారు. తల్లి ఒడిలో వేడి బిడ్డకు చేరి వ్యాధులు దరిచేరకుండా రక్షణ కల్పిస్తుందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను తాగించడంతో శిశు మరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాలు ద్వారా వెల్లడైందని తెలిపారు. ప్రస్తుతం అనేక మంది తల్లులు రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారని, అందుకు కారణం బిడ్డలకు పాలు ఇవ్వకపోవడమేనని పరిశోధనల్లో వెలుగు చూసిందన్నారు.

క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేసుకోవాలి


గర్భిణికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: గర్భిణులు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకోవాలని, ప్రభుత్వాస్పత్రి లో అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేస్తున్నామని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గర్భిణులు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకుంటే రక్తహీనత, ఎయిడ్స్ వంటి వ్యాధు ల గురించి తెలుస్తుందన్నారు. దీంతో గర్భిణులు మందులు వాడితే శిశువు ఆరోగ్యంగా, క్షేమంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో ఇచ్చే మాత్రలను క్రమం తప్పకుండా, తప్పనిసరిగా వాడాలన్నారు.